
సనత్‌నగర్‌లోని కేఎస్ఎన్ పార్కులో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్‌గౌడ్


శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు


జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో భక్తులు

వైభవంగా ఉగాది వేడుకలు

బంజారాహిల్స్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల పరిధిలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ఉదయం 3 గంటలకు ప్రత్యేక అభిషేకం నిర్వహించిన అనంతరం దర్శనానికి అనుమతించారు. శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేసి పంచాంగ శ్రవణం చేశారు. ఫిలింనగర్ దైవసన్నిధానం పంచాంగ శ్రవణానికి సినీ ప్రముఖులు హాజరయ్యారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని స్వయంభు లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. ఫిలింనగర్‌లో జరిగిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిడి నర్సింగరావు, కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

వెంగళరావునగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీహాల్‌లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్.వి.అనంత్ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, ఉపాధ్యక్షుడు మనోహర్‌రావు, కోశాధికారి సుగుణ, హనుమంతరావు యాదవ్, గంగారెడ్డి, సమితి మాజీ అధ్యక్షుడు విశ్వప్రకాశ్, కల్యాణ్ చక్రవర్తి, సంక్షేమ సమితి ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వెంగళరావునగర్‌లో..

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ ప్రధాన రహదారిలోని రామాంజనేయ స్వామి దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది, వసంత నవరాత్రి, శ్రీరామనవమి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రామాంజనేయ స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.సుధాకర్ పాల్గొన్నారు.

షిరిడీ సాయిరాం సంస్థానంలో..

వెంగళరావునగర్ కాలనీలోని షిరిడీ సాయిరాం సంస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సీతా రామచంద్రస్వామి వారి సుప్రభాత సేవ, గట్టుకేశవాచార్యలచే పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సూర్యప్రకాష్, గౌరవ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, ప్రధాన కార్యదర్శి రఘురాములు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్‌లో..

బోరబండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని రహ్మత్‌నగర్ కూడలి గ్రంథాలయం వద్ద రహ్మత్‌నగర్, వెంగళరావునగర్ డివిజన్ల కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్య ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు చెప్పారు. అన్నపూర్ణదేవి అన్నసమర్పణ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎం.శ్యామ్ రావు, సొసైటీ ప్రతినిధులు టి.కృష్ణమూర్తి గుప్తా తదితరులు పాల్గొన్నారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలోనూ ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి.

ఎర్రగడ్డలో..

ఎర్రగడ్డ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఎర్రగడ్డ డివిజన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో లక్ష్మీనారాయణ పురోహితులు పంచాంగ పఠనం చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణశర్మ, అధ్యక్షుడు వినయసాగర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. దేవాలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి తెలుగు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.జనార్దన్, కోశాధికారి ఎంవీ రెడ్డి, ఆలయ మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

హైదరాబాద్ సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకొని సనత్‌నగర్‌లోని కేఎస్ఎన్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పార్క్‌లో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి రమేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.


రహ్మత్‌నగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు


ఫిలింనగర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మామిడి నర్సింగరావు, కాటూరి రమేష్


రాజీవ్ నగర్‌లో పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న కృష్ణ శర్మ తదితరులు

బోరబండలో ముగిసిన సెహర్


సెహర్ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్

బోరబండ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ నివాసం వద్ద నెల రోజుల నుంచి నిర్వహిస్తున్న సెహర్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. సైట్-1 కాలనీ కమాన్ వద్ద ఆదివారం జరిగిన సెహర్‌లో టీమ్ ఇండియా మాజీ కెప్టెన్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొని రోజ్ దార్‌లకు భోజనం వడ్డించారు. గత పదేళ్లుగా రంజాన్ మాసంలో రోజ్‌దార్ల కోసం సెహరీ నిర్వహించడం పట్ల బాబాఫసియుద్దీన్‌ను ఆయన అభినందించారు. ముస్లింలకు ఇతర మతాలవారు సైతం రాత్రి వేళల్లో నిద్ర మానేసి భోజనం సిద్ధం చేయడం, వడ్డించడం అభినందనీయమన్నారు.

'కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి'

పంజాగుట్ట, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నేటి తరానికి కూల్ డ్రింక్స్ రూపంలో పెను ముప్పు వచ్చి పడిందని, యువత కూల్ డ్రింక్స్‌కు అలవాటు పడి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత ప్రొఫెసర్ వెనిగళ్ల రాంబాబు అన్నారు. ఆరోగ్యానికి హానిచేసే కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రకృతిసిద్ధంగా తయారైన సహజ పానీయాలను తీసుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక జూబ్లీహిల్స్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కృష్ణకాంత్ పార్క్ ప్రధాన ద్వారం వద్ద ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మధురానగర్ సంక్షేమ సమితి మాజీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయవాణి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర రావు తదితరులు పాల్గొన్నారు.

కానుక అందజేత


ఉగాదిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలను కలిసి భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ సంతకం చేసిన టీ షర్టును అందజేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.దేవరాజ్

- బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి)

ఉగాది నాడు భారీగా పన్ను వసూళ్లు

- చెల్లింపులకు నేడు చివరి రోజు

ఖైరతాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సెలవు దినమైన ఉగాది పండుగ రోజు జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించి పెద్ద ఎత్తున పన్ను వసూళ్లు రాబట్టారు. ఖైరతాబాద్ సర్కిల్(17)లో ఆదివారం ఒక్కరోజే రూ.1.12 కోట్లు వసూలు చేయగా, ప్రభుత్వ సంస్థలకు చెందిన పన్ను రూపంలో దాదాపు రూ.23 కోట్ల మేర ఆస్తిపన్ను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జమైందని, అది కూడా తమ సర్కిల్ ఖాతాకు వస్తుందని ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు.

జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.1.30 కోట్లు

ఉగాది నాడు జూబ్లీహిల్స్ సర్కిల్‌లో రూ.1.30 కోట్ల మేర ఆస్తిపన్ను వసూలైంది. ఉదయం నుంచి బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు క్షేత్ర స్థాయిలో తిరిగి పన్ను వసూలు చేశారు. మధ్యాహ్నం కార్యాలయంలోనే ఉపకమిషనర్ ప్రశాంతి ఉగాది పచ్చడి తయారు చేయించి సిబ్బందికి పంపిణీ చేశారు. పండుగ రోజు కష్టపడి పనిచేసిన సిబ్బందిని ఆమె అభినందించారు. కాగా జూబ్లీహిల్స్ సర్కిల్ లక్ష్యానికి కేవలం రూ.6 కోట్ల దూరంలో ఉన్నదని, చివరి రోజు వరకు సాధిస్తామని ఉపకమిషనర్ ప్రశాంతి తెలిపారు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో ఖైరతాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కస్టమర్ సర్వీస్ సెంటర్ నేడు కూడా పనిచేస్తుందని, నగర వాసులు పన్ను చెల్లించవచ్చని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ సర్కిళ్ల ఉపకమిషనర్లు తెలిపారు.


సర్కిల్ 17 పరిధిలో ఆస్తిపన్ను చెల్లిస్తూ అధికారికి చెక్కు అందజేస్తున్న వ్యక్తి


ఉగాది రోజు నగర వాసి నుంచి రూ.20 లక్షల ఆస్తిపన్ను చెక్కు తీసుకుంటున్న ఉపకమిషనర్ ప్రశాంతి

జూబ్లీహిల్స్ ఉపకమిషనర్ ప్రశాంతి బదిలీ

ఖైరతాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్ వి.ప్రశాంతి బదిలీ అయ్యారు. ఆమెను శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్‌గా బదిలీ చేస్తూ నగర కమిషనర్ ఇలంబరిది ఉత్తర్వులు జారీ చేశారు. బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ వి.సమ్మయ్యను జూబ్లీహిల్స్ సర్కిల్ ఉపకమిషనర్‌గా నియమించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసిన అనంతరం ప్రశాంతి బదిలీపై వెళ్లనున్నారు.

ప్రారంభమైన ఉగాది నాటకోత్సవాలు


శ్రీకృష్ణ తులాభారం నాటకంలో కళాకారుల ప్రదర్శన

బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా ఫిలింనగర్‌లోని ఫిలించాంబర్ రామానాయుడు కళామండపంలో ప్రతి ఏటా నిర్వహించే ఉగాది నాటకోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగస్థల నటులచే 5 రోజుల పాటు పొత్తూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించే ఉగాది నాటకోత్సవాల్లో భాగంగా తొలిరోజు కళాకారులు శ్రీకృష్ణ తులాభారం నాటికను ప్రదర్శించారు. వెంకట లక్ష్మీదుర్గ నాట్యమండలి తెనాలి వారిచే నిర్వహించిన శ్రీకృష్ణ తులాభారం నాటిక ఆసక్తికరంగా సాగింది. శ్రీకృష్ణుడిగా డాక్టర్ ఎ.కోటేశ్వర్‌రావు నటించగా, సత్యభామగా నంది అవార్డు గ్రహీత రత్నశ్రీ, రుక్మిణిగా సురభి వెంగమాంబ, నారదుడిగా షణ్ముఖి విజయకుమార రాజు, వసంతకుడిగా రాంబాబు, నళినిగా పద్మ నటించగా వీరికి హార్మోనియం కె. సత్తిబాబు, సుబ్రమణ్యం, డోలక్ ఎం.వీర్రాజు సహకారం అందించారు. రోజురోజుకు అంతరించిపోతున్న రంగస్థల నాటికలను నేటి తరానికి పరిచయం చేసేందుకు, రంగ స్థల నటుల ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకుడు సుబ్బారావు వెల్లడించారు.

ఇనగంటి లావణ్యకు ఉగాది పురస్కారం

బేగంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ జెక్ కాలనీకి చెందిన ప్రముఖ రచయిత్రి ఇనగంటి లావణ్యకు ఏపీ ప్రభుత్వం ఉగాది పురస్కారం అందజేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. "అలుపెరగని యోధుడు", 'సీబీఎన్ అభివృద్ధి రథసారధి"తో పాటు చంద్రబాబు నాయుడు పాలనపై ఆమె పలు పుస్తకాలను రచించారు. వీటితో పాటు రామాయణంలో చిన్న కథలు, హనుమత్ వైభవం వంటి అనేక పుస్తకాలను లావణ్య రచించారు.


ఏపీ సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న లావణ్య

పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల కోలాహలం


ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద భక్తుల సందడి

- హైదరాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)


ఫిలింనగర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ తదితరులు

- బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి)


పురస్కారం అందజేస్తున్న మేక రామకృష్ణ

రంగస్థల కళాకారులకు పురస్కారాల ప్రదానం

అమీర్‌పేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని కమ్మ సంఘం హాల్‌లో కొనసాగుతున్న ఆంధ్ర నాటక కళా సమితి 96వ జాతీయ నాటక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలువురు నాటక రంగ కళాకారులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. అమీర్‌పేట కమ్మ సంఘం ప్రధాన కార్యదర్శి మేక రామకృష్ణ, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు బొలినేని కృష్ణయ్య కళాకారులకు పురస్కారాలను అందజేశారు. రంగస్థలం నటులు ఉప్పులూరి సుబ్బరాయ శర్మ, విజయబాబు, బొప్పన నరసింహారావు, కూచి రామాంజనేయులు, కోకా విజయలక్ష్మి అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు. అనంతరం ఆంధ్ర నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో అన్నమనేని ప్రసాద్ దర్శకత్వం వహించిన యుద్ధం శాంతి అనే చారిత్రక పద్య నాటకాన్ని ప్రదర్శించారు.

ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్‌తో ఇబ్బందులు

- ఎక్కువ ఎత్తులో ఉండటంతో వాహనదారుల అవస్థలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

మోతినగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్లే వాహనాలను నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లను వేస్తుంటారు. అయితే ఇక్కడ ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ మాత్రం అందుకు భిన్నంగా ఉంది. వేగాన్ని నియంత్రించడం ఏమో కానీ ప్రమాదాలకు కారణమవుతూ యాక్సిడెంట్ స్పాట్‌గా మారింది. బోరబండ నుంచి మాదాపూర్, హైటెక్ సిటీకి వెళ్లే ప్రధాన రహదారిపై స్వరాజ్‌నగర్ వద్ద రోడ్డుపై అడ్డంగా అరడుగు ఎత్తులో కింద ఇనుప రాడ్లు పెట్టి కాంక్రీట్‌తో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేశారు. అయితే ఇది వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ఎక్కువ ఎత్తులో నిర్మించిన ఈ స్పీడ్ బ్రేకర్‌ను దాటే క్రమంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి వాహనదారులు రోడ్డుపై పడిపోతున్నారు. కార్లు వంటి వాహనాలు స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో ఎత్తుగా వేసిన కాంక్రీట్ కారు కింది భాగానికి తగిలి దెబ్బతింటున్నాయి. ప్రతి వాహనం ఈ స్పీడ్ బ్రేకర్ దాటే సమయంలో ఏదో ఒక రకమైన ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని వాహనదారులు చెబుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఇంత ఎత్తులో స్పీడ్ బ్రేకర్ నిర్మించడంపై వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన స్పీడ్ బ్రేకర్‌ను తొలగించాలని, అవసరం అయితే తక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్

బ్రాహ్మణులపై ద్వేషభావం తొలగించుకోవాలి

- విద్యా శంకర భారతి

బేగంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులపై ఉన్న ద్వేషభావం తొలగించుకొని సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు పెంపొందించేందుకు కృషి చేయాలని బేగంపేటలోని పుష్పగిరి జగద్గురు శంకరాచార్య మహాసంస్థానం పీఠాధిపతి విద్యా శంకర భారతి సూచించారు. మఠంలో ఆదివారం మేధావులు, ప్రముఖుల సమక్షంలో సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ సంస్థను విద్యా శంకర భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. బ్రాహ్మణ ఐక్యతకు అమలు చేయాల్సిన మార్గదర్శకాలు, యువత భవిష్యత్‌కు తీసుకోవాల్సిన కార్యక్రమాలపై బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ కృషి చేస్తుందన్నారు. రాజకీయ నేతలు, బ్రాహ్మణ ప్రముఖులు, పలు రంగాలకు చెందిన నిపుణులు సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎల్వీ సుబ్రమణ్యం, ఎంజీ గోపాల్, మాజీ డీజీపీ అరవిందరావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఎమ్మెల్సీ వాణిదేవి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లను కూల్చి బహుళ అంతస్తుల భవనం

- అప్పులు ఇచ్చి వాంబే ఇళ్లను లాక్కొన్న వ్యాపారి
- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే దానం
- నిర్మాణదారుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అధికారులు

బంజారాహిల్స్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పేదల కోసం కేంద్రం నిర్మించిన వాంబే ఇళ్లను బస్తీలో నివసిస్తున్న అర్హులను ఎంపిక చేసి కేటాయించారు. ఇంత వరకు బాగానే ఉంది. అయితే ఏమైందో తెలీదు కాని లబ్ధిదారులు ఒక్కొక్కరుగా ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఆ తార్వత ఆ ఇళ్లను కూల్చివేసి ఆ స్థానంలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టారు. ఫిలింనగర్ పరిధిలోని గౌతంనగర్‌కు ఓ వ్యాపారి లబ్ధిదారులకు అధిక వడ్డీకి డబ్బు అప్పుగా ఇచ్చి వాటి కింద వాంబే గృహాలను లాక్కొని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని.. ఇది నిబంధనలకు విరుద్ధమని అసెంబ్లీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. అంతేకాకుండా తాను స్వయంగా జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని చెప్పడం చర్చనీయాంశంగా మారింది. బస్తీకి చెందిన వేణు అనే ఎమ్మార్పీఎస్ నాయకుడు సైతం ఈ అంశంపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశాడు. అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించడంతో ఈ వ్యవహారంపై సర్కిల్ 18 జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారుల్లో కదలిక వచ్చింది. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే కోణంలో విచారించారు. ఈ నేపథ్యంలో నిర్మాణ దారుడు వెంకట్ రెడ్డికి నోటీసులు జారీ చేయగా అతని నుంచి సమాధానం రాలేదు. దీంతో వెంటనే అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతూ జీహెచ్ఎంసీ సర్కిల్ 18 డిప్యూటీ కమిషనర్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పోలీసులకు జీహెచ్ఎంసీ అధికారులు అందజేసిన ఫిర్యాదు కాపీ


వాంబే ఇళ్లను కూల్చి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనం (గ్రీన్ మ్యాట్ ఉన్నది)

సీనియర్ సిటిజన్ల హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ గోపాలకృష్ణ

బోయినపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలోని సీనియర్ సిటిజన్‌లు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి అన్నారు. బోయినపల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి డీఐ సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో సమతానగర్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లి దండ్రులు, సీనియర్ సిటిజన్స్ యాక్ట్, సైబర్ క్రైమ్ ఇతర శాంతి భద్రతల సమస్యలు, నివారణ సంక్షేమంపై తమ సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్‌లు, తల్లిదండ్రుల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, ఎవరికైనా తమ పిల్లలు ఇతరుల ద్వారా ఎలాంటి కష్టాలు, నష్టాలు కలిగినా వెంటనే స్థానిక పోలీస్ శాఖ అధికారులను సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కాలనీలోని సుమారు 100 మంది వృద్ధులు పాల్గొనగా, సైబర్ క్రైమ్ డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐ నాగేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం సభ్యత్వ నమోదు



కురుమ సంఘం సభ్యత్వ నమోదులో పాల్గొన్న చెలిమిళ్ల బాలమల్లయ్య

సికింద్రాబాద్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కురుమల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని కురుమ సంఘం అధ్యక్షుడు చెలిమిళ్ల బాలమల్లయ్య అన్నారు. కురుమ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం రసూల్‌పురాలో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలంతా సంఘంలో సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. సభ్యత్వం ద్వారా చాలా ప్రయోజనాలు ఉంటాయని వెల్లడించారు.

చలివేంద్రం ఏర్పాటు



తార్నాక కమ్మ సేవా సంఘం అధ్యక్షుడు వల్లభనేని వీరభద్రయ్య ఆధ్వర్యంలో తార్నాకలోని ప్రధాన రహదారి బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం కమ్మ సేవా సంఘం ప్రతినిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో కమ్మ సేవా సంఘం ప్రతినిధులు మన్నె నాగమల్లేశ్వరి, అడుసుమిల్లి చిట్టి వీరయ్య, కాట్రగడ్డ నరేంద్ర బాబు, కనకమేడల రాంబాబు, మాదాల రాధాకృష్ణ, తోటకూర చంద్రమౌళి, కిలారి చరణ్, నల్లూరి శివరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- తార్నాక, మార్చి 30(ఆంధ్రజ్యోతి)



బొల్లారం రిసాల బజార్‌లోని జామా ఈ మసీద్‌లో కమిటీ సభ్యులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్
- తిరుమలగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి)



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్



ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న సీతాఫల్‌మండి డివిజన్ సవరాలబస్తీకి చెందిన భువనరావు



బజార్ హనుమాన్ ఆలయంలో ఉత్సవ విగ్రహాలతో ఈఓ మహేందర్ రెడ్డి

లష్కర్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

- భక్తులతో ఆలయాలు రద్దీ
- కళకళలాడిన కాలనీలు, బస్తీలు

సికింద్రాబాద్/ బోయినపల్లి/ మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లష్కర్‌లో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయా లు ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడా యి. ఉగాది పండుగను పురస్కరించుకొని కాలనీలు, బస్తీలు సందడిగా మారాయి. ఉగాది పచ్చడిని పంపిణీ చేసి, పంచాంగ శ్రవణం వినిపించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, అధికార అనధికార ప్రముఖులు వేడుకల్లో పాల్గొన్నారు.

తిరుమలగిరి: బొల్లారం డౌటన్ బజార్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖకు చెందిన శ్రీహనుమాన్ ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వసంత నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయని ఈఓ మహేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయం మాజీ ధర్మకర్త బాబు సుందరం, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నరసింహన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవి బాల్‌రాజ్, శ్రీధర్ యాదవ్, జీవి వినోద్ ఉన్నారు.



ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో భక్తులకు ఉగాది పచ్చడితో ఆశీస్సులు అందజేస్తున్న దృశ్యం

బౌద్ధనగర్: సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లోని నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్ కల్యాణ వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలకరించారు. ఆలయ చైర్మన్ ఎన్. ప్రకాశరావు, ఇందిరా దంపతులు ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణి చేశారు.



రసూల్‌పురాలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఇందిరా దంపతులు



బోయినపల్లిలోని పోలీస్ స్టేషన్ ముందు ఏర్పాటు చేసిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న జంపన ప్రతాప్, ఉద్యమకారులు ప్రభు గుప్తా, అరుణ్ యాదవ్



● భద్రాచలంలోని శ్రీరామచంద్రుడి ఆలయ కార్య నిర్వహణాధికారి రమాదేవికి సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నగరానికి వచ్చిన రమాదేవి బోయినపల్లిని సందర్శించి జంపన ప్రతాప్ కుటుంబ సభ్యులకు ఆమె ప్రసాదం అందజే శారు.
- సికింద్రాబాద్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి)



● బోయినపల్లిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మన్ కీ బాత్ కార్యక్రమంలో పాల్గొని ఉగాది ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మధ్య ప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్ రావు, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా మల్లికార్జున్
- బోయినపల్లి, మార్చి 30(ఆంధ్రజ్యోతి)

హమాల్‌బస్తీలో రియల్ బాహుబలులు



బండరాయిని ఎత్తటానికి ప్రయత్నిస్తున్న యువకుడు,



బండరాయిని ఎత్తిన యువకుడితో బస్తీవాసులు

పద్మారావునగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రీల్ బాహుబలులను మనం ఎంతో మందిని చూస్తుంటాం. రియల్ బాహుబలులు చాలా అరుదుగా కనిపిస్తారు. అలాంటి కోవకు చెందిన వారే హమాల్‌బస్తీ నివాసితులు. ఎన్నో ఏళ్లుగా కర్నాటక, నారాయణ్‌పేట్ (పాలమూరు)వంటి అనేక ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వలసొచ్చి కూలీ నాలీ చేస్తూ హమాల్‌బస్తీలో స్థిర నివాసం ఏర్పరచుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని 30 ఏళ్ల నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న 110 కిలోలకు పైగా బరువున్న గుండ్రటి బండరాయిని సునాయసంగా ఎత్తుతూ... వారి ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వీరి బల ప్రదర్శనను తిలకించిన వారు ఆశ్చర్యానికి లోను కాక తప్పదు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని హమాల్‌బస్తీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దాదాపుగా 10 మందికి పైగా బండను ఎత్తడానికి ప్రయత్నించి కొందరు విఫలులయ్యారు. విజయ్‌కుమార్(మట్టి) ఈ.శ్రీనివాస్, శ్రీను, హనుమదాస్, సోను, శాను, విజయకుమార్ బండను ఎత్తి భుజంపై పెట్టుకొని విజేతలుగా నిలిచారు. విజేతలను బస్తీవాసులు శాలువాతో సత్కరించారు. శ్రీను, శాను, విజయ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ప్రత్యేకంగా కోడ్ల గ్రామం, కర్నాటక రాష్ట్రం నుంచి రావడం ప్రత్యేకంగా నిలిచింది. కార్యక్రమంలో యాదగిరి, నేరేటి రవికుమార్, శ్యామ్,పాషా, గోవింద్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశన్‌రాజు, అంబులెన్స్ సురేశ్, సుధాకర్ రెడ్డి, ఎం. శ్రీను, సురేశ్, బసవరాజు పాల్గొన్నారు.

కస్టమర్‌తో దురుసు ప్రవర్తన వ్యక్తిపై పెట్టీ కేసు

రెజిమెంటల్ బజార్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కుమార్తె పుట్టిన రోజు సందర్భంగా కేక్ తీసుకురావడానికి షాపు దగ్గకు వెళ్లిన వ్యక్తికి, హోటల్ సిబ్బందికి మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు, బాధితుడి కథనం ప్రకారం.. షామీర్‌పేటకు చెందిన శేఖర్ అనే వ్యక్తి పనిమీద సికింద్రాబాద్ స్టేషన్ వచ్చాడు. తన కుమార్తె పుట్టిన రోజు కావడంతో కేక్ తీసుకొదాకొద్దామని స్టేషన్ ఎదురుగా ఉండే ఆల్ఫా హోటల్‌కు వెళ్లాడు. అక్కడ కౌంటర్‌లో ఉండే వ్యక్తి కేక్ చూపించగా ప్రెష్‌గా లేదే అని ప్రశ్నించాడు. ప్రెష్ వి అమ్మకుండా పాడైనవి అమ్ముతామా అంటూ షాపు వారు ఎదురు ప్రశ్నించడంతో గొడవకు దారి తీసింది. వెంటనే బాధితుడు మార్కెట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో షాపు వారిపై పెట్టీ కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణులపై ద్వేషభావం తొలగించుకోవాలి

● విద్యా శంకర భారతి

బేగంపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణులపై ఉన్న ద్వేషభావం తొలగించుకొని సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలు పెంపొందించేందుకు కృషి చేయాలని బేగంపేటలోని పుష్పగిరి జగద్గురు శంకరాచార్య మహా సంస్థానం పీఠాధిపతి విద్యా శంకర భారతి సూచించారు. మఠంలో ఆదివారం మేధావులు, ప్రముఖుల సమక్షంలో సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ సంస్థను విద్యా శంకర భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. బ్రాహ్మణ ఐక్యతకు అమలు చేయాల్సిన మార్గదర్శకాలు, యువత భవిష్యత్‌కు తీసుకోవాల్సిన కార్యక్రమాలపై బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ కృషి చేస్తుందన్నారు. రాజకీయ నేతలు, బ్రాహ్మణ ప్రముఖులు, పలు రంగాలకు చెందిన నిపుణులు సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎల్వీ సుబ్రమణ్యం, ఎంజీ గోపాల్, మాజీ డీజీపీ అరవిందరావు, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, ఎమ్మెల్సీ వాణిదేవి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో.. ఆ పాధా?

- దుమ్ము ధూళితో ప్రజల అవస్థలు
- రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా వేయని రోడ్డు
- ఇబ్బంది పడుతున్న వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధి ప్రజలు
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

రెండు, మూడు రోజుల్లో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయంటూ రోడ్డును తవ్విన ఇంజనీరింగ్ అధికారులు పత్తా లేకుండా పోయారు. నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాల్సిన ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా... వేలాది మంది ప్రజలు నిత్యం దుమ్ము ధూళితో అవస్థలు పడుతున్నారు.



వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో రోడ్డుపై దుమ్మూ, దూళి

సికింద్రాబాద్, బౌద్ధనగర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధిలో రెండున్నర సంవత్సరాల క్రితం సివరేజీ, మంచినీటి పైపులైన్ మరమ్మతుల నిమిత్తం రోడ్డును తవ్వారు. ఇప్పటి వరకు అలానే ఉంది. తవ్విన రోడ్డుపై ఇసుక, దుమ్ము, మట్టికుప్పలుగా విపరీతంగా పేరుకుపోవటంతో పాటు గుంతలు పడడంతో ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నారు. సీవరేజీ, మంచినీటి పైపులైన్ నిర్మాణాలు పూర్తయి రెండున్నర సంవత్సరాలు గడస్తున్నా ఇప్పటి వరకు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల సమన్వయలోపంతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. కొద్దిపాటి వర్షం కురిస్తే తవ్విన రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోతుందని, దీంతో వాహనాదారులు, పాదాచారులు, పిల్లలు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నూతన రోడ్డును నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మేయర్ మాటలు గాలికే..

సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ డివిజన్లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, వివిధ విభాగాల అధికారులతో కలిసి జనవరి 9వ తేదీన సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక బస్తీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారాసిగూడ పోచమ్మ ఆలయం వీధి రోడ్డు సమస్యను మేయర్ దృష్టికి తీసుకెళ్లారు. పోచమ్మ ఆలయ వీధి రోడ్డును మేయర్, ఉన్నతాధికారులు సందర్శించి పరిశీలించారు. స్థానిక మహిళలు రోడ్డును తవ్వి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు నూతన రోడ్డును వేయలేదని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. యుద్ధప్రతిపాదికపై నూతన రోడ్డును నిర్మించాలని మేయర్ సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంక్రాంతి పండుగ వెళ్లగానే నూతన రోడ్డు పనులను చేపడతామని మేయర్ స్థానిక మహిళలకు హామీ ఇచ్చారు. మేయర్ వచ్చి మూడునెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నూతన రోడ్డు పనులు చేపట్టకపోవడంతో స్థానిక మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డుపై దుమ్ము దూళితో ఇబ్బందులు పడుతున్నాం



తవ్విన రోడ్డుపై దుమ్ము, దూళి విపరీతంగా పెరిగిపోయిందని, దీంతో పిల్లలు, పెద్దలు డస్ట్ ఎలర్జీ భారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు వెళ్లేటప్పుడు దుమ్ములేచి ఇళ్లలోకి వస్తోంది. కొద్దిపాటి వర్షం కురిసిదంటే గుంతల్లో నిలిచిన వర్షపునీటితో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి.
- పేర్ల నరేష్, అడ్వోకేట్, వారాసిగూడ

అనారోగ్యం భారిన పడుతున్నారు



తవ్విన రోడ్డుపై విపరీతంగా పేరుకుపోయిన దుమ్ము, దూళితో స్థానికులు అనారోగ్యాల భారిన పడుతున్నారు. ఇంటిముందు పార్కింగ్ చేసిన వాహనాలపై విపరీతంగా దుమ్ము పడుతోంది. ఈరోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు న్యూఅశోక్‌నగర్, పార్శీగుట్ట, రాంనగర్‌కు వెళ్తుంటాయి. తవ్విన రోడ్డుపై వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఎమ్మెల్యే, కార్పొరేటర్, ఉన్నతాధికారులు రోడ్డు సమస్యలను పట్టించుకోవడంలో విఫలం చెందుతున్నారు. ఇప్పటికైనా నూతన రోడ్డును నిర్మించాలి.
- గాయత్రి, గృహిణి, వారాసిగూడ





మట్టికుప్పలు, కంకర తేలిన రోడ్లు

స్వర్గవాటికలో ఎస్వీ ధార్మిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్, సీఈఓ మధుకర్ నాయక్

తిరుమలగిరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత అంత్యక్రియలకు సికింద్రాబాద్ తిరుమలగిరిలోని ఆర్టీసీ కాలనీ వద్ద ఉన్న స్వర్గ వాటిక ఎంతో ప్రసిద్ధి చెందినది. ఈ స్వర్గ వాటికలో పలు విభాగాలను ఆదివారం నూతనంగా ప్రారంభించారు. జాతీయ కొవిడ్ యోధుడు పద్మశ్రీ జితేందర్ సింగ్ షంటి ఎస్వీ ధార్మిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కంటోన్మెంటు ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు, కొత్త ఎల్‌పీజీ ఆధారిత దహన ఘాట్‌ను కంటోన్మెంటు బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ గో క్యాస్ట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా స్వర్గ వాటిక వ్యవస్థాపక ట్రస్టీ, అధ్యక్షుడు సురేందర్ పాల్‌సింగ్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్వర్గ వాటిక ట్రస్ట్ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ముందుకు వెళ్తోందన్నారు. ఈ ఆరోగ్య కేంద్రం డయాగ్నోస్టిక్, డెంటల్, ఫిజియోతెరపి, ఈఎస్‌టీ, సేవలు జనరల్ మెడిసిన్ అందిస్తోందన్నారు. మార్కెట్ తరగతి పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని అన్నారు. రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్లు పూర్తిగా పర్యావరణహితమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నాయని చెప్పారు. దహన వాటిక అవసరాలను వంద శాతం గ్రీన్ ఎనర్జీతో తీర్చనున్నాయని అన్నారు. గో క్యాస్ట్ తయారీ కేంద్రం పర్యావరణ అనుకూల దహన మార్గాలను ప్రోత్సాహిస్తోందని తెలిపారు. డిజిటల్ మెమోరియల్స్ సృష్టించుకునే అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. కొత్త ఎల్‌పీజీ ఆధారిత దహన ఘాట్ పర్యావరణహిత దహన విధానానికి అనుకూలంగా ఉంటుందన్నారు.

స్వర్గ వాటికలోని సుందరమైన వాతావరణం సందర్శకులు, శోకతప్త కుటుంబాలకు ప్రశాంతమైన, పర్యావరణ అనుకూల పరిసరాలను అందిస్తోందన్నారు. ఇక్కడ గో క్యాస్ట్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు. ఇది గోమయంతో తయారైనదన్నారు. పర్యావరణ హిత అంత్యక్రియలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తోందన్నారు. ఈ చర్య వృక్షాలు అవసరమవుతాయని అన్నారు. గో క్యాస్ట్ ద్వారా కలప వినియోగాన్ని గణనీయంగా తగ్గించొచ్చన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పడుతోందన్నారు. రెండు కొత్త ఏసీ హియర్స్‌వ్యాన్లు, బాడీ ఫ్రీజర్ బాక్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. శవ భస్మాలను భద్రపరచడానికి లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఆధునిక ఎల్‌పీజీ ఫర్నేస్‌లను అమలు చేయడం ద్వారా కలప వినియోగాన్ని 25 శాతం తగ్గించవచ్చన్నారు. నేచురల్ ఫైర్స్ కోసం కాస్ట్ ఐరన్ స్టీల్ నిర్మాణం ఏర్పాటు చేశామన్నా రు. మాన్యువల్, ఎల్‌పీజీ దహనాల కోసం ఏసీ వేయిటింగ్ హాల్లు ఒకేసారి నాలుగు శవాలను భద్రపరిచే మార్చురీ స్టోరేజీ కలదన్నారు. దీని ద్వారా శవాలను ఎక్కువ కాలం భద్రపరచవచ్చన్నారు. అనాథ శవాలకు ఉచిత దహనం, బీపీఎల్ కుటుంబాలకు 50శాతం రాయితీ ఉందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి సహకారంతో కంటి దానాన్ని ప్రోత్సాహించడంలో భాగంగా దాతలకు ఉచితంగా దహన సౌకర్యం కల్పించామన్నారు.

సామాజిక బాధ్యతలో నిబద్ధత

మహమ్మారి సమయంలో స్వర్గ వాటిక సామాజిక బాధ్యతను ఎంతో నిబద్ధతతో చేసిందన్నారు. ఆపదలో ఉన్న వారికి ఉచిత ఆక్సిజన్ కాంసన్‌ట్రేటర్లను అందించిందన్నారు. సామాజిక సేవ ఒక బాధ్యతతో కొనసాగిస్తోందన్నారు. అంత్యక్రియ సేవలు మెడికల్ సౌకర్యాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వర్గ వాటిక వ్యవస్థాపక ట్రస్టీ, జనరల్ సెక్రటరీ రంజన్ సూద్, వ్యవస్థాపక ట్రస్టీ దయానంద్ గౌరీ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి తేజ్‌దీప్ కౌర్ తదితరులు పాల్గొన్నారు.